## క్లుప్తంగా

### నేడు ఎల్లమ్మ బోనాలు

**తుర్కయంజాల్:** పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో మంగళవారం ఎల్లమ్మ, పోచమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

**మాడ్గుల:** వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు మోహన్ సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వలన మలేరియా, డెంగీ, డయేరియా, కామెర్ల వంటి ప్రాణంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. డయేరియా సోకిన వారికి వాంతులు, విరేచనాలు అవుతాయని చెప్పారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు.. వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

### ఆర్థిక సహాయం

**తలకొండపల్లి:** మండల పరిధి వెల్జాల్‌కు చెందిన షకీల్ బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు.. షకీల్ వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.19వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

### నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

**ఆమనగల్లు:** బీసీ కుల గణన గురించి చర్చించనున్నామని బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో రౌండ్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షలో కుల గణనతో పాటు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ పెంపుపై చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సింహాద్రి, నాగుల వేణు రానున్నట్లు యాదవ్ తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిధి బీసీ నాయకులు, కులసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

### విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

**ఆమనగల్లు:** కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ముదిరాజ్‌సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆమనగల్లు పట్టణంలోని కట్ట మైసమ్మ దేవాలయాన్ని ఇటీవల పునర్నిర్మించారు. ఇందులో భాగంగా ఈ నెల 21 నుంచి 23 వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో ముదిరాజ్ సంఘం నాయకులు ఎర్రవోలు మహేశ్, రాజు, చిన్న వెంకటయ్య పాల్గొన్నారు.

### భక్తి భావంతో ప్రశాంతత

**షాద్‌నగర్:** భక్తి భావం పెంపొందించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్, మహేశ్వరి దంపతులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

### శివనామస్మరణతో మారుమోగిన ఆలయం



కనకమామిడిలోని దత్తాత్రేయ దేవాలయంలో దర్శనం కోసం క్యూలో భక్తులు

**మొయినాబాద్‌రూరల్:** హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ శివ నామస్మరణతో సంగమేశ్వర దేవాలయం మారుమోగింది. శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా శివలింగానికి పుష్పార్చన, పూజలు చేశారు. ఆలయంలో పూజారులు గణపతి హోమం, ధ్వజస్తంభ పూజలు, గర్భగుడిలో అభిషేకాలు నిర్వహించారు.

**దత్తాత్రేయ ఆలయంలో..**

దత్తాత్రేయ దేవాలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొని దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఘనంగా రక్షా బంధన్



కడ్తాల్: సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



కడ్తాల్: తమ్ముడికి రక్ష కడుతున్న సోదరి



ఆమనగల్లు: పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి

సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సోదరులు.. అమ్మానాన్నలా అండగా ఉంటామంటూ తోబుట్టువులకు తోచిన కానుకలు సమర్పించి పాదాభివందనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: వృక్షాబంధన్‌లో భాగంగా చెట్టుకు రాఖీ కట్టిన గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సభ్యులు



ఆమనగల్లులో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



మాడ్గుల: తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి



ఇబ్రహీంపట్నం: తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి



తలకొండపల్లి: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్‌కు రాఖీ కట్టుతున్న మాజీ ఎంపీపీ నిర్మల



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



తుర్కయంజాల్: బీజేపీ రాష్ట్ర నాయకుడు దయానంద్ గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి



తలకొండపల్లి: మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్‌కు రాఖీ కడుతున్న సోదరి మాధవి



యాచారం: దళితమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాషాకు రాఖీ కడుతున్న సోదరి



తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య నివాసంలో రాఖీ సందడి

## భక్తిభావం పెంపొందించుకోవాలి



పూజా కార్యక్రమంలో నాయకులు

**ఆమనగల్లు:** ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. మండల పరిధి ఆకుతోటపల్లి గ్రామంలో రజకసంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి దేవాలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రావిరాల పరమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో శీతలాదేవి సహిత మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ కడ్తాల మండల అధ్యక్షుడు బాలరాజు, రజక సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు వేణు, యాదయ్య, వెంకటయ్య, రాములు, శ్రీను, శేఖర్, చెన్నయ్య, రవి, కిష్టయ్య, రామచంద్రయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గాయత్రియజ్ఞం



నూలుపూర్ణిమ గాయత్రియజ్ఞంలో పద్మశాలిసంఘం నాయకులు

**ఆమనగల్లు:** భక్త మార్కండేయస్వామి దేవాలయంలో సోమవారం నూలుపూర్ణిమ గాయత్రియజ్ఞం ఘనంగా నిర్వహించారు. పూజారులు నాగభూషణ స్వామి, శరత్‌చంద్రల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు, సుప్రభాతం, ధ్వజారోహనం, జ్యోతి ప్రజ్వలన, గణపతి పూజ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో నూలు పూర్ణిమ గాయత్రియజ్ఞం నిర్వహించారు. సామూహికంగా గాయత్రి ధారణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమ మాధురి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీను, పద్మశాలీ సంఘం నాయకులు అప్పం శ్రీను, సత్యరాములు, శివలింగం, శ్రీను, ఈశ్వరయ్య, మామిడిశెట్టి రవి, శ్రీను, సురేశ్, రవి, శ్రీధర్, నిరంజన్, ప్రవీణ్, మధుసూదన్, నిరంజన్, సోమశంకర్, రఘు, ప్రసాద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి సందడి

- జన సందోహంతో రహదారుల రద్దీ
- కొనుగోలు దారులతో కిటకిటలాడిన రాఖీ, మిఠాయి దుకాణాలు



రాఖీ దుకాణంలో కొనుగోలుదారుల సందడి



మిఠాయి షాప్‌లో..

**ఇబ్రహీంపట్నం:** అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రయాణ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడగా.. రహదారులన్నీ సందడిగా కనిపించాయి. పట్నంలోని ప్రధాన రహదారుల వెంట వెలసిన మిఠాయి, రాఖీ దుకాణాలు కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయాయి. రకరకాల రంగుల్లో.. ఆకర్షణీయమైన ఆకృతుల్లో తీర్చిదిద్దిన రాఖీలకు డిమాండ్ బాగా పెరిగింది. అధిక ధరలకు విక్రయిస్తున్నా.. కొనుగోలుకు మహిళలు ఏమాత్రం వెనకాడలేదు. దీంతో ఈ ఏడు రాఖీ వ్యాపారం బాగా జరిగిందని వ్యాపారులు తెలిపారు.



ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

## పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి



గౌడ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించిన సంఘం నాయకులు

**కడ్తాల్:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని గౌడ కార్మిక సంఘం చరికొండ అధ్యక్షుడు రాములుగౌడ్ అన్నారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో తొలుత పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శులు యాదయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, కార్యదర్శులు అంజయ్యగౌడ్, యాదయ్యగౌడ్, కోశాధికారి పెద్ద చంద్రయ్యగౌడ్, కార్యవర్గ సభ్యులు నర్సింహాగౌడ్, రాములుగౌడ్, వెంకటయ్యగౌడ్, సత్తయ్యగౌడ్, కార్మిక సంఘం యువజన విభాగం అధ్యక్షుడు ముచ్చం గౌడ్, నాయకులు జంగయ్యగౌడ్, ముత్యాలుగౌడ్, పెదయ్య, బాలయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, సత్తయ్యగౌడ్, జయహరి, భూపాల్, చెన్నయ్య, యాదయ్యగౌడ్, శ్రీను, వెంకటయ్య, పెద్దకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

### దంచి కొట్టిన వాన

**ఇబ్రహీంపట్నం:** పట్నంలో సోమవారం మధ్యాహ్నం అరగంట పాటు వర్షం దంచి కొట్టింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు ఈ స్థాయిలో ఒకటి రెండు సార్లు తప్పితే.. చెప్పుకోదగిన భారీ వర్షాలు కురవలేదు. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. ఫలితంగా భూగర్భ జలాలు పెరగలేదు. పైగా వానాకాలంలో ఎండకాలాన్ని తలపించేలా ఉక్కపోత తీవ్రమయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురిసిన వర్షంతో ప్రాంత ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం, రైతులకు కాస్త ఊరట లభించినట్లయింది.

### ఫైన్ ఆర్ట్స్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

**చేవెళ్ల:** బీసీ గురుకుల కళాశాలలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశానికి గడువు ఈ నెల 24వ తేదీ వరకూ పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి.నర్సింహ తెలిపారు. కాలేజీలో బీఏ యానిమేషన్ వీఎఫ్ఎక్స్ కోర్సు కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు (ఇంటర్ పూర్తి చేసిన వారు) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90326 44463, 9063242329 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్
- ఎస్సీ వర్గీకరణ తీర్పును పునర్ సమీక్షించాలి
- రేపు భారత్ బంద్ విజయవంతం చేయాలని పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమ్‌సేన ట్రైబల్ ఆర్మీ

**షాద్‌నగర్:** సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన తీర్పును న్యాయస్థానం మరోసారి సమీక్షించాలని ఆయన కోరారు. భీమ్‌సేన ట్రైబల్ ఆర్మీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ గురించి ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఈ తీర్పు రాజకీయ ప్రయోజనాల కోసమేనంటూ ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీన పరిచి రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా, సామాజికంగా అణిచివేసే కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వినోద్, శేఖర్, కేశవులు, మూర్తి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డిగూడ, సంకేపల్లిగూడలో బోనాలు



మల్లారెడ్డిగూడలో బోనాల ఊరేగింపు

**షాబాద్:** వర్షాలు పుష్కలంగా కురిసి, పాడి పంటలతో పల్లెలు బాగుండేలా చూడు తల్లి అని భక్తులు కోరుకున్నారు. సోమవారం షాబాద్ మండల పరిధి మల్లారెడ్డిగూడ, సంకేపల్లిగూడ గ్రామాల్లో పోచ్చమ్మ మహిళలు పెద్ద ఎత్తున బోనం ఎత్తారు. డప్పుచప్పుళ్ల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాలను ఊరేగింపుగా గ్రామ దేవతల చెంతకు చేరుకున్నారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడిగా మారింది. కార్యక్రమంలో ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ గ్రామాల మాజీ సర్పంచులు చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, పరిగి గణేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు గోపాల్, రాపోల్ నర్సింలు, రాజు, ప్రవీణ్, రాఘవరెడ్డి, బాల్‌రాజ్, రాఘవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాధికారిగా శంకర్‌లాల్



శంకర్‌లాల్‌ను సన్మానించిన ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు

**చేవెళ్ల:** మండల వ్యవసాయ అధికారిగా శంకర్‌లాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏఓ తులసీ బదిలీపై పరిగి మండల కేంద్రానికి వెళ్లారు. ఆమె స్థానంలో శంకర్‌లాల్ వచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌లాల్‌కు ఫర్టిలైజర్ దుకాణాల అసోసియేషన్ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శంకర్‌లాల్ మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ.. సాగులో సలహాలు, సూచనలు ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తగ్గుతున్న రోడ్డు విస్తీర్ణం!

- గ్రామీణ రహదారుల నిర్వహణ కరువు
- ఇరువైపులా పెరుగుతున్న కంప చెట్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



సిద్ధాపూర్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

**కొత్తూరు:** రోడ్డు సౌకర్యం బాగుంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయి. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సమయాల్లో గ్రామాల నుంచి పట్టణాలకు చేరుకోవడానికి సులువుగా ఉంటుంది. కానీ కొంత కాలంగా గ్రామీణ రోడ్ల సంరక్షణ కరువయింది. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి దారి విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. వాహనదారులు ఆస్పత్రి పాలవుతున్నారు. అయినప్పటికీ ఈ విషయంలో సంబంధిత అధికారులు చేపట్టడం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 18 అనుబంధ గ్రామాలు, తండాలు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో 55.29 కిలోమీటర్ల మేర బీటీ, 10.07 సీసీ రోడ్లు, మరో 15.62 కిలో మీటర్ల మేర మెటల్‌రోడ్లు ఉన్నాయి. ఆర్అండ్‌బీ పరిధిలో సుమారు 43 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు ఉంది. రూ. కోట్లు వెచ్చించి గ్రామాలు, పట్టణాలకు వేసిన రోడ్లకు ఏళ్లుగా నిర్వహణ కరువైంది.

### నిర్వహణలో అలసత్వం

ఎన్నో ఆందోళనలు, వినతుల మధ్య ఆయా గ్రామాలకు అధికారులు, పాలకులు రోడ్లను మంజూరు చేస్తున్నారు. రోడ్ల ఏర్పాటు తర్వాత సంబంధిత శాఖల అధికారులు వాటి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొత్తూరు-సిద్ధాపూర్, జేపీ దర్గా-కొత్తూరు, తిమ్మాపూర్ రైల్వేస్టేషన్-జాతీయ రహదారితో పాటు పలు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగాయి. దానికి తోడు వర్షానికి మట్టి పేరుకుపోయి వెడల్పు తగ్గుతుంది. దీంతో అవి ఇరుకుగా మారడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

### కంప చెట్లను కొట్టేయాలి



రోడ్ల నిర్వహణకు అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యత వహించాలి. ప్రతి సంవత్సరం అధికారులు రోడ్లకు ఇరువైపులా పెరిగే కంప చెట్లను తొలగింపజేయాలి. వర్షాల కారణంగా పేరుకుపోయిన మట్టిని తీసివేయించాలి.

– కర్రొళ్ల సురేందర్, కొత్తూరు

### నిధులు మంజూరు కావు



పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్ల నిర్వాహణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు మంజూరు కావు. అయినప్పటికీ మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లను పరిశీలించి వాటి పరస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడతాం.

–హేమంత్, పంచాయతీరాజ్ ఏఈ, కొత్తూరు